


TGTEL/25/A31

# నేటి దిక్సూచి

తెలుగు దిన పత్రిక




ప్రచురణ. రంగారెడ్డి, సంపుటి:01 సంచిక :161 ఎడిటర్ పి. అలివేలు పేజిలు : 04, వెల. 2రూ/ బుధవారం- 08 - జూలై- 2026

## త్వరలో 'ఈ25 పెట్రోల్' ను తీసుకువస్తున్నారా? కేంద్రం ఇచ్చిన క్లారిటీ ఇదే!




- ఈ25 పెట్రోల్ గురించి ఎలాంటి ప్రతిపాదనలు లేవు

స్పష్టం చేసిన కేంద్ర ప్రభుత్వం

ఢిల్లీ : ఇథనాల్ బ్లెండింగ్ ప్రక్రియలో భాగంగా ఈ25 పెట్రోల్ ను తీసుకువస్తున్నారంటూ జరుగుతున్న ప్రచారాన్ని మంగళవారం కేంద్ర ప్రభుత్వం ఖండించింది. ప్రస్తుతం అలాంటి ప్రతిపాదనలు ఏవీ లేవని స్పష్టం చేసింది. అయితే వివిధ వాహనాలపై ఈ25 పెట్రోల్ ప్రభావం ఎలా ఉందో చూస్తున్నారని, ఆ నివేదికలు ఇంకా రాకముందే ఎలాంటి కీలక నిర్ణయం తీసుకోలేమని పేర్కొంది.

**వదంతులు నమ్మవద్దు!**

## సాంప్రదాయ హస్తకళా వారసత్వానికి

# ఆంధ్రప్రదేశ్ పుట్టినిల్లు

- ★ఏపీ హస్తకళలను ప్రపంచ నలుమూలలకు తీసుకెళ్దాం
- ★మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా హస్తకళా రంగం కూడా అభివృద్ధి చెందాలి
- ★విజయవాడ అంబేడ్కర్ కళా వేదికలో ఏపీ హస్తకళా మహోత్సవంలో పాల్గొన్న పవన్




అమరావతి : జాతి గొప్పతనం నిర్మాణాల్లో కాదు, కళాకారుల పనితనంలో ఉంటుందని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. బొబ్బిలి వీణలు, ఏటికొప్పాక బొమ్మలు మన సంస్కృతి చాటుతున్నాయన్నారు. హస్తకళా రూపాలు ప్రపంచానికి చేరాలంటే ఆన్‌లైన్ మార్కెటింగ్ అవసరం అన్నారు. వృద్ధమని భావించే గుర్రపుడెక్క ఆకుతో కూడా కళాకృతులు రూపొందించారని గుర్తుచేశారు. హస్తకళాకారుల హెల్త్ ఆడిట్ చేయాలని అధికారులను ఆదేశించారు. విజయవాడ అంబేడ్కర్ కళా వేదికలో ఏపీ హస్తకళా మహోత్సవానికి పవన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మిగతా..2లో

## మోదీ ఖాతాలో మరో పురస్కారం..

# 'భారతీయులకు దక్కిన గౌరవం"

- ❖భారత ప్రధాని నరేంద్ర మోదీకి అరుదైన గౌరవం దక్కింది.ఇండోనేషియా అత్యున్నత పురస్కారం
- ❖'బింతాంగ్ ఆదిపూర్ణ'ను ఆదేశ అధ్యక్షుడు ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో చేతుల మీదుగా (మంగళవారం) పీఎం మోదీ అందుకున్నారు.


2లో..

ఢిల్లి : భారత్- ఇండోనేషియా రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించినందుకు గాను ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఇండోనేషియా అత్యున్నత పురస్కారమైన 'బింతాంగ్ ఆదిపూర్ణ' ఇండోనేషియా ప్రభుత్వం ప్రకటించింది.

## ప్రపంచానికి దిక్సూచిగా తెలంగాణ AI విధానం: భట్టి విక్రమార్క




హైదరాబాద్‌లో జరిగిన రెండు రోజుల 'గ్రీన్ గ్రోత్ ఎకనామిక్ సమిట్'లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ, బాధ్యతాయుతమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అభివృద్ధిలో తెలంగాణను ప్రపంచ దేశాలకు ఒక రోల్ మోడల్‌గా నిలబెడుతున్నట్లు ప్రకటించారు. కేవలం డేటా సెంటర్ల సామర్థ్యాన్ని పెంచడమే కాకుండా, పర్యావరణ పరిరక్షణ మరియు సామాజిక బాధ్యతలతో మిగతా..2లో

## టీఆర్ఎస్ పార్టీ పేరుపై కవితకు ఢిల్లీ హైకోర్టులో ఊరట..



- టీఆర్ఎస్ (తెలంగాణ రక్షణ సేన) పార్టీ పేరు కేటాయింపు వివాదంలో కల్వకుంట్ల కవితకు ఢిల్లీ హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది.
- టీఆర్ఎస్ పేరును కేటాయించడం సాధ్యం కాదంటూ కేంద్ర ఎన్నికల సంఘం
- ఈ ఏడాది మే 12, జూన్ 23 తేదీల్లో జారీ చేసిన నోటీసులకు వారం రోజుల్లో సమాధానం ఇవ్వడానికి కవితకు అవకాశం కల్పిస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

## కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు

# ఒకటో తారీఖునే జీతాలు

- కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వివరాలు డిజిటలైజ్ చేయాలన్న సీఎం రేవంత్ రెడ్డి
- సమయానికి జీతాలు ఇవ్వని ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు
- కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై సమీక్ష


మిగతాది 2లో

హైదరాబాద్: మరింత పారదర్శకత కోసం తెలంగాణ రాష్ట్రంలో పరిపాలన వ్యవస్థను డిజిటలైజ్ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. డిజిటల్ గవర్నెన్స్‌కు ప్రణాళికలు సిద్ధం చేయడంతో పాటు అవసరమైన చట్టాలను రూపొందించాలని చెప్పారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించడంతో పాటు సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు చేర్చేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ఎంసీఆర్ హెఆర్డీలోని బోధి పెవిలియన్ లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలి : ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటో తారీఖున జీతాలు అందించేందుకు వివరాలను పూర్తిగా డిజిటలైజ్ చేయాలని అధికారులకు సూచించారు. వివిధ విభాగాలలోని కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, జీతాలు, బ్యాంక్ అకౌంట్ వివరాలను పూర్తిగా డిజిటలైజ్ చేయాలని ఆదేశించారు.

## సింగరేణికి మరో 2 బొగ్గు బ్లాక్‌ల

# కేటాయింపు..

## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటన


2లో..

- సింగరేణికి నైనీ కోల్ బ్లాక్
- తాడిచెర్ల-2 బ్లాక్ కూడా కేటాయింపు
- బొగ్గు ఉత్పత్తి పెంచాలని సూచన
- నైనీలో 35 ఏళ్లకు సరిపడా నిల్వలు
- రూ.75 వేల కోట్ల ఆదాయం అంచనా

హైదరాబాద్: సింగరేణికి మరో రెండు కీలక బొగ్గు బ్లాక్‌లు దక్కనున్నాయి. ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్‌తో పాటు తాడిచెర్ల-2 కోల్ బ్లాక్‌ను కూడా సింగరేణికి కేటాయిస్తున్నట్లు కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి ప్రకటించారు.

## భోగాపురం విమానాశ్రయం సిద్ధం.. త్వరలో ప్రారంభం




భోగాపురం విమానాశ్రయాన్ని సందర్శించిన రామ్మోహన్ నాయుడు

అన్ని పనులు పూర్తయ్యాయని తెలిపిన కేంద్ర మంత్రి

మోదీ సమయం ఖరారు చేస్తే ప్రారంభోత్సవం ఉంటుందని వెల్లడి

అమరావతి : ఉత్తరాంధ్రలో కొత్త అభివృద్ధి చరిత్రకు నాంది పలుకుతూ భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణం పూర్తి స్థాయికి చేరుకుంది. కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఈరోజు విమానాశ్రయాన్ని సందర్శించి పనుల పురోగతిని సమీక్షించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన స్పష్టమైన ఆదేశాలతో జీఎంఆర్ సంస్థ షెడ్యూల్ ప్రకారం పనులు పూర్తి చేసిందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. మిగతా..2లో

## హైదరాబాద్ నుంచి దక్షిణ భారత పుణ్యక్షేత్రాలకు కొత్త రైలు

IRCTC

చెర్లపల్లి-తిరుచ్చి మధ్య వారానికి ఒకసారి ప్రత్యేక సర్వీస్

తిరుపతి, అరుణాచలం, శ్రీరంగం క్షేత్రాలకు నేరుగా ప్రయాణం

ప్రతి మంగళవారం చెర్లపల్లి నుంచి బయలుదేరనున్న రైలు

ఏసీ, స్లీపర్, జనరల్ కోచ్‌లతో కూడిన 22 బోగీల రైలు

హైదరాబాద్ : దక్షిణ భారతదేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన తిరుపతి, అరుణాచలం (తిరువణ్ణామలై), శ్రీరంగం సందర్శించాలనుకునే భక్తులకు దక్షిణ మధ్య రైల్వే శుభవార్త అందించింది. హైదరాబాద్‌లోని చెర్లపల్లి నుంచి తిరుచ్చి (తిరుచిరాపల్లి) వరకు నూతన వీక్లీ ప్రత్యేక రైలు సేవలను మంగళవారం నుంచి ప్రారంభించింది. ఈ రైలు సౌకర్యంతో భక్తులు ఒకే ప్రయాణంలో ఈ మూడు ముఖ్యమైన మిగతా..2లో

## ఎల్ నినో ఎఫెక్ట్ - ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలి




- విపత్తుల వల్ల ఏ ఒక్క ప్రాణనష్టం జరగకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యం
- రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో నిరంతరం పని చేసేలా ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని హోం మంత్రి ఆదేశాలు

అమరావతి : నైరుతి రుతుపవనాలు, ఎల్ నినో ప్రభావంపై ఉన్నత స్థాయి అధికారులతో హోం మంత్రి అనిత సమీక్ష నిర్వహించారు.

## మరో 11 ప్రాజెక్టులకు SIPB ఆమోదం

# రూ.9076 కోట్ల పెట్టుబడులు, 10 వేల ఉద్యోగాలు

- ▶▶సీఎం అధ్యక్షతన రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం
- ▶▶పరిశ్రమలు, పెట్టుబడులు మౌలిక సదుపాయాల కల్పన శాఖల ప్రాజెక్టులపై చర్చ
- ▶▶రూ.9,076 కోట్ల పెట్టుబడులకు సంబంధించి 11 ప్రాజెక్టులపై చర్చ




అమరావతి : రైతు కుటుంబాలు ఎంటర్‌ప్రెన్యూర్లుగా ఎదిగేలా పారిశ్రామికంగా రాష్ట్రం అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆ దిశగా పెట్టుబడులను ఆకర్షించాలని అధికారులకు నిర్దేశించారు. ఇథనాల్ ప్రాజెక్టుల ఏర్పాటును ప్రోత్సహించాలని భవిష్యత్తులో పెరిగే డిమాండ్‌ను అందిపుచ్చుకోవాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన 19వ రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశంలో 11 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. దీనిద్వారా రూ.9,076 కోట్ల పెట్టుబడులు, 10531 ఉద్యోగ అవకాశాలు కలుగుతాయి. రైతు కుటుంబాలకు అదనపు ఆదాయం : ఈ సందర్భంగా రైతు కుటుంబాలకు అదనపు ఆదాయం సమకూర్చేలా, ఎంట్రప్రెన్యూర్లుగా ఎదిగేందుకు దోహదం చేసేలా పారిశ్రామికీకరణ జరగాలని, ఆ దిశగా పెట్టుబడులను ఆకర్షించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు స్పష్టం చేశారు. ఇందులో భాగంగా భవిష్యత్ లో పెరిగే ఇథనాల్ డిమాండ్ ను అందిపుచ్చుకోవాలని చెప్పారు. ఇథనాల్ బ్లెండింగ్ 40 శాతానికి పెంచితే మొక్కజొన్న రైతులకు అదనపు ఆదాయం వస్తుందన్నారు. ఇథనాల్ తయారీ రంగంలో మిగతా..2లో

## ఏపీలో ఈవీ సెమీ కండక్టర్స్ హబ్ ఏర్పాటు చేయండి' దక్షిణకొరియాలో మూడో రోజు లోకేశ్ పర్యటన

దక్షిణకొరియా ఎల్ జీ కెమ్ అధునాతన కార్యకలాపాలు

నమూనాగా మూలపేటలో ప్రపంచస్థాయి నాఫ్తా క్రాకర్ కేంద్రం

ఏర్పాటుకున్న అవకాశాలను పరిశీలించాలని విజ్ఞప్తి



అమరావతి : దక్షిణకొరియాలో మంత్రి నారా లోకేశ్ పెట్టుబడుల వేట కొనసాగుతోంది. ఎల్ జీ కెమ్ గ్లోబల్ స్ట్రాటజీ సెంటర్ ప్రెసిడెంట్ యున్ - జు కోహ్‌తో లోకేశ్ సమావేశమయ్యారు. కాకినాడ పోర్టు సమీపంలో పాలీస్టైరిన్ తయారీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. దక్షిణకొరియా ఎల్ జీ కెమ్ అధునాతన కార్యకలాపాలు నమూనాగా మూలపేటలో ప్రపంచస్థాయి నాఫ్తా క్రాకర్ కేంద్రం ఏర్పాటుకున్న అవకాశాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. ఈవీ, బ్యాటరీ పవర్ స్టోరేజీ వ్యవస్థ రూపకల్పన, సమీకృత క్యాథోడ్ యాక్టివ్ మెటీరియల్, సెల్ తయారీ కేంద్రాన్ని ఆంధ్రలో పెట్టాలన్నారు. ఎస్ఏఎఫ్ , బయో -ఇథనాల్ ఉత్పత్తి, జీవ ఇంధనాల తయారీ కేంద్రం ఏర్పాటు చేయాలని విన్నవించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను వాల్యూ యాడెడ్ వనరులుగా మార్చడం, ప్లాస్టిక్ రీసైక్లింగ్, పైరోలిసిస్ ప్లాంట్ల ప్రారంభానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి పని చేయాలన్నారు. శ్రీసిటీలో యాక్రిలోనిట్రైల్ బ్యూటాడైన్ మిగతా..2లో

## మొదటి పేజి తరువాయి

## మరో 11 ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ ఆమోదం

## రూ.9076 కోట్ల పెట్టుబడులు, 10 వేల ఉద్యోగాలు

వచ్చే అన్ని పెట్టుబడులను ప్రోత్సహించాలన్నారు. పెట్రోలు, డీజిల్లో మిక్స్ చేసేందుకు ఇథనాల్ భారీగా అవసరం కానుందన్నారు. ఇథనాల్, మీథేన్, ఏవియేషన్ ఫ్యూయల్ కు సంబంధించి పాలసీ తీసుకురావాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఆ పరిశ్రమలకు పెద్దఎత్తున ప్రోత్సాహాలు : సంపద సృష్టి, సర్క్యులర్ ఎకానమీ అనేది ప్రభుత్వ విధానం అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను పెద్దఎత్తున ప్రోత్సహించాలని నిర్దేశించారు. 19వ ఎస్ఐపీబీ సమావేశంలో మొత్తం 11 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్, టూరిజం, పెట్టుబడులు మౌలిక సదుపాయాల కల్పన శాఖల ప్రాజెక్టులపై ఎస్ఐపీబీలో ప్రధానంగా చర్చించారు. మంత్రులు అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, పి. నారాయణ, గొట్టిపాటి రవికుమార్, కందుల దుర్గేశ్ , పయ్యావుల కేశవ్, సీఎస్ సాయి ప్రసాద్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## భోగాపురం విమానాశ్రయం సిద్ధం.. త్వరలో ప్రారంభం

ఇప్పటికే ఎయిరోడ్రోమ్ లైసెన్స్ వచ్చేసిందని వెల్లడించారు. ప్రధాని మోదీ సమయం ఖరారు చేస్తే వారి చేతుల మీదుగా ప్రారంభోత్సవ వేడుక ఉంటుందని కేంద్ర మంత్రి తెలిపారు. 78 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మితమైన టెర్మినల్ భవనం సంవత్సరానికి ఏకంగా నాలుగు కోట్ల మంది ప్రయాణికులకు సేవలు అందించే సామర్థ్యం కలిగి ఉంటుందని చెప్పారు. ఉత్తరాంధ్ర సంస్కృతి, కళలు ఉట్టిపడేలా డిజైన్ చేయడంతో ఇది దేశంలోనే అత్యుత్తమ విమానాశ్రయాల్లో ఒకటిగా నిలుస్తుందని వ్యాఖ్యానించారు. ప్రారంభం అయిన వారం లోపు విశాఖ విమానాశ్రయ కార్యకలాపాలను భోగాపురానికి మార్చి పూర్తి స్థాయిలో సేవలు ప్రారంభిస్తామని తెలిపారు.

## కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటో తారీఖునే జీతాలు

తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 4,800 కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు ఉండగా ఇందులో 4,300 ఏజెన్సీలు ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్ చెల్లించడం లేదని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఏజెన్సీలకు ప్రభుత్వం నిధులు విడుదల చేసినప్పటికీ ఉద్యోగులకు సమయానికి జీతాలు చెల్లించడం లేదని గుర్తించిన సీఎం అలాంటి ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలి : డిజిటల్ గవర్నెన్స్ తో సమస్యకు చెక్ పెట్టాలని రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఒకటి నుంచి 5వ తేదీలోగా పారదర్శకంగా జీతాలు చెల్లింపులు జరిపేందుకు డిజిటల్ గవర్నెన్స్ ఉపయోగపడుతుందని అన్నారు. అందుకే పూర్తి వివరాలను డిజిటలైజ్ చేయాలన్న సీఎం అందుకోసం వివిధ విభాగాల అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. కమిటీ 100 రోజుల్లో ఈ అంశాన్ని కొలిక్కి తీసుకురావాలని ఆదేశించారు. హెల్త్ కార్డులు, ఇతర బెనిఫిట్స్ అమలు చేసేందుకు ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను కూడా డిజిటలైజ్ చేయాలని సీఎం తెలిపారు. నిరంతరం పర్యవేక్షించేందుకు ఆర్థిక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమీక్షలో ఎంపీ నరేందర్ రెడ్డి, సలహాదారు రామకృష్ణారావు, సీఎస్ సంజయ్ జాజు, ఉన్నతాధికారులు జయేష్ రంజన్, శేషాద్రి, శాంతి కుమారి, సందీప్ కుమార్ సుల్తానియా, గౌరవ్ ఉప్పల్, వేతన సవరణ కమిషనర్ ఎన్. శివ శంకర్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సింగరేణికి మరో 2 బొగ్గు బ్లాక్‌ల కేటాయింపు..

ఈ నిర్ణయం సంస్థ భవిష్యత్తుకు పెద్ద ఊరటనిస్తుందని చెప్పారు. ఢిల్లీలో మంగళవారం మాట్లాడిన కిషన్ రెడ్డి సింగరేణికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందన్నారు. బొగ్గు ఉత్పత్తిని మరింత పెంచాల్సిన అవసరం ఉందని సూచించారు. ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్ సింగరేణికి దక్కేలా కేంద్రం చొరవ తీసుకుందని వెల్లడించారు. ఇతర రాష్ట్రాల్లో జరిగే బొగ్గు బ్లాక్‌ల వేలంలోనూ సింగరేణి పాల్గొనేలా తన వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నైనీ కోల్ బ్లాక్‌లో మరో 35 ఏళ్లకు సరిపడా బొగ్గు నిల్వలు ఉన్నాయని కిషన్‌రెడ్డి చెప్పారు. దీని వల్ల సింగరేణికి సుమారు రూ.75 వేల కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. తెలంగాణలో లక్షలాది కుటుంబాల జీవనాధారం సింగరేణి అని పేర్కొన్నారు. తాడిచెర్ల-2 కోల్ బ్లాక్‌ను కూడా సింగరేణికే కేటాయించాలని కేంద్రం నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. ఈ బ్లాక్‌తో సంస్థ కార్యకలాపాలు మరింత బలోపేతం అవుతాయన్నారు. భవిష్యత్తులో ఉత్పత్తి పెరగడానికి ఇది దోహదపడుతుందని తెలిపారు.

## హైదరాబాద్ నుంచి దక్షిణ భారత పుణ్యక్షేత్రాలకు కొత్త రైలు

క్షేత్రాలను ఎంతో సులభంగా సందర్శించుకోవచ్చు. రైలు నంబర్ 17077 ప్రతి మంగళవారం సాయంత్రం 5:20 గంటలకు చెర్లపల్లిలో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 8:50 గంటలకు తిరుపతికి, మధ్యాహ్నం 1:20 గంటలకు తిరువణ్ణామలైకి, సాయంత్రం 4:30 గంటలకు శ్రీరంగానికి చేరుకుంటుంది. అనంతరం సాయంత్రం 6:45 గంటలకు తిరుచిరాపల్లికి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో, రైలు నంబర్ 17078 ప్రతి బుధవారం రాత్రి 9:30 గంటలకు తిరుచ్చిలో బయలుదేరి, మరుసటి రోజు రాత్రి 10:20 గంటలకు చెర్లపల్లికి చేరుకుంటుంది. హైదరాబాద్ నుంచి తిరుపతికి ఇప్పటికే సుమారు 20 రైళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ, అరుణాచలానికి నేరుగా రైలు సౌకర్యం కల్పించాలని భక్తులు చాలాకాలంగా కోరుతున్నారు. ఈ కొత్త సర్వీసు ప్రారంభంతో వారి చిరకాల కోరిక నెరవేరినట్లయింది. మొత్తం 22 కోచ్‌లతో నడిచే ఈ రైలులో 3 సెకండ్ ఏసీ, 5 థర్డ్ ఏసీ, 10 స్లీపర్ క్లాస్, 4 జనరల్ సెకండ్ క్లాస్ బోగీలు అందుబాటులో ఉన్నాయి.

## మోదీ ఖాతాలో మరో పురస్కారం..

## “భారతీయులకు దక్కిన గౌరవం“

ఈ సందర్భంగా ప్రధానమంత్రిఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ...‘‘ఈ ఉదయం నాకు ఇండోనేషియా అత్యున్నత పురస్కారాన్ని ఎంతో ఆప్యాయతతో అందించారు. ఈ గౌరవం కోట్లాది మంది భారతీయులకు దక్కినది... ఇది ఇండోనేషియా ప్రజల సెంటిమెంట్‌కు, భారత్-ఇండోనేషియాల మధ్య ఉన్న చారిత్రాత్మక, సన్నిహిత సంబంధాలకు ప్రతీక. ఈ సందర్భంగా అధ్యక్షుడు ప్రబోవో జీకి, ఇండోనేషియా ప్రభుత్వానికి ఇక్కడి ప్రజలకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నాను“ అని పీఎం మోదీ పేర్కొన్నారు.

### విదేశాంగ శాఖ స్పందన

విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఈ అవార్డును “భారత్-ఇండోనేషియా స్నేహానికి దక్కిన నివాళి“ గా అభివర్ణించారు. మన సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత లోతుగా చేయడంతో పాటు, భారత్ - ఆసియాన్ సంబంధాలను బలోపేతం చేయడానికి పీఎం మోదీ చేసిన నిరంతర కృషికి ఈ పురస్కారమే నిదర్శనమని విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ ఎక్స్‌లో రాసుకొచ్చారు.

### ‘బింతాంగ్ ఆదిపూర్ణ‘ పురస్కార చరిత్ర

ఈ అవార్డును 1959 లో ఇండోనేషియా ప్రభుత్వం ప్రారంభించింది. ఇది రిపబ్లిక్ ఆఫ్ ఇండోనేషియాలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన, అత్యున్నతమైన పురస్కారం. ఇండోనేషియా రిపబ్లిక్ యొక్క ఐక్యత, నిరంతర వృద్ధి, శ్రేయస్సు కోసం అసాధారణమైన సేవలు అందించిన వ్యక్తులకు ఈ అత్యున్నత గౌరవాన్ని అందజేస్తారు.

## ప్రపంచానికి దిక్సూచిగా తెలంగాణ విధానం: భట్టి విక్రమార్క




కూడిన కఠినమైన నిబంధనలతో ఏఐ ప్రమాణాలను రాష్ట్రం నిర్దేశిస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి ఆయన ఈ సదస్సులో మాట్లాడారు. టెక్ కంపెనీలకు కేవలం భూమి, విద్యుత్, నీరు వంటి వనరులను ఇష్టారాజ్యంగా కేటాయించే పద్ధతికి స్వస్తి పలికి, వాటి వినియోగంలో పారదర్శకతను తీసుకువస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. కొత్తగా వచ్చే సాంకేతిక పరిశ్రమలు కచ్చితంగా పునరుత్పాదక ఇంధనాన్ని మరియు రీసైకిల్ చేసిన నీటిని మాత్రమే ఉపయోగించాలని, స్థానిక యువతకు నైపుణ్యాభివృద్ధిని అందించాలని స్పష్టం చేశారు. కార్బన్ క్రెడిట్ తరహాలోనే ‘పీపుల్స్ క్రెడిట్‘ అనే సరికొత్త విధానాన్ని ప్రవేశపెడుతూ, మహబూబాబాద్ నుండి ఆదిలాబాద్ వరకు గ్రామీణ యువతకు ఉపాధి, సాంకేతిక నైపుణ్యాలు లభించేలా ఏఐ పెట్టుబడులను మళ్లించనున్నారు. సాంకేతికత కోసం వ్యవసాయం, తాగునీటి వనరులను పణంగా పెట్టే ప్రసక్తే లేదని, సమర్థవంతమైన వాటర్ కూలింగ్ వ్యవస్థలున్న కంపెనీలకే ప్రాధాన్యత ఇస్తామని, భాషా అడ్డంకులను తొలగించి సామాన్యుడికి సైతం ఏఐ ప్రయోజనాలు అందేలా మానవీయ కోణంలో హైదరాబాద్‌ను నైతిక సాంకేతిక హబ్‌గా తీర్చిదిద్దుతామని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# సాంప్రదాయ హస్తకళా వారసత్వానికి ఆంధ్రప్రదేశ్ పుట్టినిల్లు

## మొదటి పేజి తరువాయి

ఈ సందర్భంగా హస్తకళాకారుల స్టాళ్లను పరిశీలించారు. కొండపల్లి, ఏటికొప్పాక వంటి బొమ్మలను ఆసక్తిగా చూశారు. హస్తకళాకారుల గ్రామాలను పర్యాటకంతో అనుసంధానించాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో చేనేత, హస్తకళల సలహాదారు సుచిత్రా ఎల్లా సూచించిన ప్రతిపాదనను పవన్ అభినందించారు.

### సాంప్రదాయ హస్తకళా వారసత్వానికి ఆంధ్రప్రదేశ్ పుట్టినిల్లు: పవన్ కల్యాణ్

“సాంప్రదాయ హస్తకళా వారసత్వానికి ఆంధ్రప్రదేశ్ పుట్టినిల్లు. కళాకారుల అద్భుత ప్రతిభ వారి కష్టాన్ని గుర్తించడానికి వచ్చా. అద్భుత కళల వెనుక లక్షలమంది కళాకారుల కృషి ఉంది. వస్తువుల తయారీ మాత్రమే కాదు, వారసత్వాన్ని సజీవంగా ఉంచుతున్నారు. తరతరాల సంప్రదాయాన్ని కళాకారులు కాపాడుతున్నారు. రాష్ట్రంలో రెండు లక్షలమందికి పైగా కళాకారులు ఉన్నారు. మూడో వంతుకు పైగా అవార్డులు సాధించామంటే కళాకారుల ప్రతిభకు ఇదే నిదర్శనం. గ్లోబల్ మార్కెట్‌కు అనుసంధానం చేస్తూ హస్తకళా రంగానికి కొత్త దిశ.




గుర్రపుడెక్క ఆకుతో కూడా వస్తువుల తయారీ చూస్తున్నాం. వదిలేసిన వస్త్రాలు కూడా వ్యర్థం కాకుండా వస్తువుల తయారీ చూస్తున్నాం. డబ్బు సంపాదనే కాదు, పర్యావరణ పరిరక్షణ కూడా ప్రాముఖ్యంగా తీసుకుంటున్నారు. ఒక ఇంటి నుంచి ప్రారంభమైన వస్తువుకు ప్రపంచ మార్కెట్‌లో గిరాకీ లభిస్తోంది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా హస్తకళా రంగం కూడా అభివృద్ధి చెందాలి. మారుమూల గ్రామంలోని కళాకారుడి కృషి, ప్రపంచానికి చేరాలనేదే లక్ష్యం. తల్లిదండ్రుల కళను పిల్లలు కూడా అనుసరించేలా చేయాలి. మనందరం కలిసి కళాకారులను ప్రోత్సహిద్దాం. వోకల్ ఫర్ లోకల్ మాత్రమే కాదు, లోకల్ టు గ్లోబల్ లక్ష్యంగా పనిచేద్దాం. ఏపీ హస్తకళలను ప్రపంచ నలుమూలలకు తీసుకెళ్దాం. మార్కెటింగ్ ఇంకా పెంచగలిగితే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చు. అనారోగ్య సమస్యల నుంచి కళాకారులను కాపాడాలి. తొలుత కళాకారులందరికీ ఆరోగ్య పరీక్షలు చేయించాలి. హస్తకళాకారుల పిల్లలు చదువుకునేలా ఏర్పాట్లు చేయాలి. వంశపారపర్యంగా వచ్చిన కళను ముందుకు తీసుకెళ్లడం కూడా ముఖ్యమే. హస్తకళా రంగాలు భారతదేశ మూలాలు. దేశ సంస్కృతి, సంప్రదాయాలు కొనసాగాలంటే హస్తకళను, చేనేతను కాపాడుకోవాలి. వస్తువుల తయారీలో కొత్త ఆవిష్కరణలు రావాలి“ అని పవన్ కల్యాణ్ తెలిపారు. “కళాకారుల ప్రతిభ ప్రపంచానికి తెలియాలి. పిల్లలు, వారి తల్లిదండ్రుల కళను వారసత్వంగా కొనసాగించాలి. సంప్రదాయం గుర్తుచేసుకోవడానికి కాదు, మరింత ముందుకు సాగాలి. లోకల్ టు గ్లోబల్ రీతిన మన హస్తకళలు ప్రపంచానికి చేరాలి. మన వస్తువులకు మార్కెటింగ్ పెరగాలి. కళారూపాలకు మూలాధారమైన కర్ర నిల్వ అవసరం. కళాకారులపై కేసులు లేకుండా చేశాం. హస్త కళాకారుల కోసం కంటిచూపు పరీక్షలు నిర్వహిస్తాం. భారతదేశ ఉనికికి హస్త కళారూపాలు మూలం. హస్త కళాకారుల కోసం ప్రభుత్వం దన్నుగా నిలబడుతుంది. ప్రతి కళాకారుడికి ఒక కథ, ఒక కష్టం ఉంటుంది. హస్తకళల గ్రామాలను పర్యాటకంగా అనుసంధానం చేయాలి. హస్త కళాకారుల సమస్యలపై కేబినెట్‌లో ప్రస్తావిస్తా.

## ఏపీలో ఈవీ సెమీ కండక్టర్స్ హబ్ ఏర్పాటు చేయండి‘ - దక్షిణకొరియాలో మూడో రోజు లోకేశ్ పర్యటన

## మొదటి పేజి తరువాయి

స్టైరీన్ కాంపౌండ్ ప్లాంట్ నిర్వహిస్తున్నట్లు యున్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కొత్త ప్రతిపాదనలపై సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. 3వ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్: ఎల్జీ పాలిమర్స్ విశాఖపట్నం ప్లాంట్ (గోపాలపట్నం) ద్వారా గతంలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ భారతీయ కార్యకలాపాలకు, ఇతర తయారీదారులకు (పాలీస్టైరీన్) కీలకమైన పాలిమర్ భాగాలను సరఫరా చేశామని ఎల్జీ కెమ్ గ్లోబల్ స్ట్రాటజీ సెంటర్ ప్రెసిడెంట్ యున్-జు కోహ్ గుర్తు చేశారు. ప్రస్తుతం శ్రీసిటీలో, యాక్రిలోనిట్రైల్ బ్యూటాడైన్ స్టైరీన్ కాంపౌండ్ ప్లాంట్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కొత్తగా ఏపీలోని శ్రీసిటీలో రూ. 5,000 కోట్ల వ్యయంతో 3వ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ నిర్మిస్తోందని ఎల్ జీ ఎలక్ట్రానిక్స్ (ఇండియా) సీఈవో హాంగ్ జు జియోన్ తెలిపారు. దీనిద్వారా సుమారు 1,500 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. ఈ ఏడాది చివరినాటికి శ్రీసిటీ యూనిట్ ద్వారా వాణిజ్య ఉత్పత్తి ప్రారంభించాలని భావిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందించిన తాజా ప్రతిపాదనలపై సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. హ్యుందాయ్ మోబిస్ విస్తరణ: దక్షిణ కొరియాకు చెందిన ఆటోమోటివ్ మాడ్యూల్స్, కాంపొనెంట్స్, ఎలక్ట్రిఫికేషన్ పరికరాల తయారీ సంస్థ హ్యుందాయ్ మోబిస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ యంగ్ బిన్ కిమ్, వైస్ ప్రెసిడెంట్ హన్సోక్ పార్క్, జంగ్‌హో సియోలతో ఆయన సియోల్‌లో సమావేశమై చర్చించారు. ఏఐ, ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఆంధ్రప్రదేశ్‌లో ఈవీ సెమీ కండక్టర్స్ హబ్ ఏర్పాటు చేయాల్సిందిగా మంత్రి లోకేశ్ విజ్ఞప్తి చేశారు. తిరుపతి, అనంతపురం సమీపంలో ఈవీ కాంపోనెంట్స్ & బ్యాటరీ సిస్టమ్స్ తయారీ కేంద్రం, విశాఖపట్నంలో హ్యుందాయ్ మోబిస్ ఆర్&డీ ఇంజనీరింగ్ విభాగాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. ఐఐటీ తిరుపతి భాగస్వామ్యంతో ఒక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రతిపాదించారు. అనంతపురాన్ని ఆటోమొబైల్ హబ్‌గా మార్చడానికి, టైర్-1 సరఫరాదారుల సమావేశం నిర్వహించేందుకు ఆంధ్రప్రదేశ్‌తో భాగస్వామ్యం వహించాలని కోరారు. భారతదేశంలో హ్యుందాయ్ మోబిస్ విస్తరణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంపూర్ణ మద్దతునిస్తుందని చెప్పారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హ్యుందాయ్ మోబిస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ యంగ్ బిన్ కిమ్ అన్నారు. సెమీ కండక్టర్స్, ఓశాట్ (అసెంబ్లింగ్, ప్యాకేజింగ్, టెస్టింగ్) రంగంలో పేరెన్నికగన్న ‘అపాక్ట్’ కంపెనీ సీఈవో సియాంగ్ డాంగ్ లీతో మంత్రి లోకేశ్ సియోల్ లో సమావేశమయ్యారు. ఓశాట్ భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్‌లో అపాక్ట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినందుకు మంత్రి లోకేశ్ ధన్యవాదాలు తెలిపారు. అపాక్ట్‌తో దీర్ఘకాలిక భాగస్వామ్యాన్ని




ఆశిస్తున్నట్లు చెప్పారు. భారతదేశంలో పెట్టుబడులు పెట్టేందుకు పరిశీలిస్తున్న ‘హనా మైక్రాన్’ తో పాటు ఇతర ఓశాట్ సంస్థలు ఆంధ్రప్రదేశ్ వైపు చూసేలా అనుసంధానించాలని ఓశాట్‌ను కోరారు. ఓశాట్ సెమీకండక్టర్ కార్యకలాపాలకు సంబంధించి యువతలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించడం కోసం ఓశాట్‌తో భాగస్వామ్యం కుదుర్చుకోవాలని మంత్రి లోకేశ్ ప్రతిపాదించారు. భారతదేశంలో అపాక్ట్ కార్యకలాపాల విస్తరణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని లోకేశ్ స్పష్టం చేశారు. వైజాగ్ జాయింట్ వెంచర్ ఆంధ్రప్రదేశ్‌కు లభించిన ఒక ప్రతిష్టాత్మక సెమీకండక్టర్ విజయమని అపాక్ట్ సీఈవో సియాంగ్ డాంగ్ లీ అభివర్ణించారు. ఏపీ ప్రభుత్వం అందించిన ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలిస్తామని ఈ సందర్భంగా లీ తెలిపారు.

## ఎల్ నినో ఎఫెక్ట్ - ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలి

## మొదటి పేజి తరువాయి

విపత్తుల ప్రభావాన్ని తగ్గించేలా సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విపత్తుల వల్ల ఏ ఒక్క ప్రాణనష్టం జరగకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని హోం మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో నిరంతరం పని చేసేలా ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. రాయలసీమ జిల్లాలపై ఎక్కువగా ఎల్ నినో ప్రభావం చూపుతుందని అన్నారు. శ్రీసత్యసాయి, అనంతపురం, అన్నమయ్య జిల్లాల్లో తీవ్రస్థాయిలో వర్షాల కొరత ఉందని తెలిపారు. కర్నూలు, నంద్యాల, చిత్తూరు, కడప జిల్లాల్లో ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, తిరుపతిలో వర్షాభావ ప్రభావం మధ్యస్థంగా ఉన్నట్లు వెల్లడించారు. కరవు ముప్పు ఉన్న మండలాల్లో ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని మంత్రి ఆదేశించారు. వరద ముప్పు ఉన్న లోతట్టు




ప్రాంతాల ప్రజల తరలింపునకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. కీలక సేవలు నిలిచిపోవద్దు: పునరావాస కేంద్రాలలో ఆహారం, తాగునీరు, వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీరు, విద్యుత్ వంటి కీలక సేవలకు ఎలాంటి అంతరాయం కలగకూడదని సూచించారు. పోలీస్, ఫైర్, ఎన్ డీఆర్ ఎఫ్ , ఏపీఎస్ డీఆర్ ఎఫ్ బృందాలు అత్యవసర స్పందనకు సిద్ధంగా ఉండాలని హోం మంత్రి అనిత ఆదేశించారు. తూర్పు గోదావరి జిల్లాపై ఎల్ నినో ప్రభావం తీవ్రస్థాయిలో ప్రభావం చూపిందని సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది వరి సాగు గణనీయంగా తగ్గిందని, ఇప్పటి వరకు కేవలం 30 శాతం విస్తీర్ణంలోనే నాట్లు వేశారని అధికారిక గణాంకాలు స్పష్టం చేశాయి. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా రైతులు పంట నష్ట పోకుండా ఉండేందుకు ప్రభుత్వం ముందస్తుగా ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. వరి మాత్రమే పండే ప్రాంతాల్లో రైతులు సాధారణ వరి రకాలు కాకుండా తక్కువ సమయంలో పంట వచ్చే వరి రకాలను సాగు చేయాలని సూచించింది. చెరువులు, బావులు, బోర్ల కింద పంటలు పండించే రైతులు తప్పని సరిగా పంట మార్పిడి విధానాన్ని పాటించాలని అధికారులు తెలుపుతున్నారు.

## టీఆర్ఎస్ పార్టీ పేరుపై కవితకు ఢిల్లీ హైకోర్టులో ఊరట..

## మొదటి పేజి తరువాయి

న్యూఢిల్లీ: టీఆర్ఎస్ (తెలంగాణ రక్షణ సేన) పార్టీ పేరు కేటాయింపు వివాదంలో కల్వకుంట్ల కవితకు ఢిల్లీ హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. టీఆర్ఎస్ పేరును కేటాయించడం సాధ్యం కాదంటూ కేంద్ర ఎన్నికల సంఘం ఈ ఏడాది మే 12, జూన్ 23 తేదీల్లో నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. దీనిపై వారం రోజుల్లో సమాధానం ఇవ్వడానికి కవితకు అవకాశం కల్పిస్తూ ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ వ్యవహారంలో ఎన్నికల సంఘం నోటీసులకు ఇప్పటివరకు స్పందించని కవిత.. నేరుగా ఈరోజు(మంగళవారం) ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం వారం రోజుల్లో కవిత తన అభిప్రాయాలను తెలిపిన తర్వాత వ్యక్తిగతంగానూ ఆమె వాదనలు విని తుది నిర్ణయం తీసుకోవాలని ఈసీకి హైకోర్టు సూచించింది. విచారణ సందర్భంగా ఎన్నికల సంఘం తరఫు న్యాయవాది కీలక అంశాలను కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటికే టీఆర్ఎస్ పేరుతో పోలిక ఉన్న రెండు రాజకీయ పార్టీలు నమోదై ఉన్నందున అదే పేరును కవితకు కేటాయించడం ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని తెలిపారు. అంతేకాకుండా టీఆర్ఎస్ పేరుపై వెయ్యికి పైగా అభ్యంతరాలు వచ్చాయని, గతంలో ఇలాంటి వ్యవహారాల్లో ఎవరికీ వ్యక్తిగతంగా వాదనలు వినడానికి అవకాశం ఇవ్వలేదని కోర్టుకు వివరించారు. టీఆర్ఎస్ పేరును కేటాయించడం సాధ్యం కాదని ఇప్పటికే కవితకు స్పష్టం చేసినట్లు ఈసీ తరఫు న్యాయవాది తెలిపారు. మరోవైపు కవిత తరఫు న్యాయవాది మాత్రం టీఆర్ఎస్ పేరును ఆమెకు కేటాయించాలని కోర్టులో వాదనలు వినిపించారు. ఎన్నికల సంఘం జారీ చేసిన నోటీసుల నేపథ్యంలో కవితకు వాదనలు వినిపించే అవకాశం ఇవ్వకుండానే ప్రతికూల నిర్ణయం తీసుకోవడం సముచితం కాదని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఇరు పక్షాల వాదనలు విన్న ఢిల్లీ



హైకోర్టు వారం రోజుల్లో కవిత అభిప్రాయాలను తెలిపిన తర్వాత వ్యక్తిగతంగానూ ఆమె వాదనలు విని తుది నిర్ణయం తీసుకోవాలని ఈసీకి ఢిల్లీ హైకోర్టు సూచించింది.


## త్వరలో ‘ఈ25 పెట్రోల్‘ ను తీసుకువస్తున్నారా? కేంద్రం ఇచ్చిన క్లారిటీ ఇదే!

## మొదటి పేజి తరువాయి

ఈ25 పెట్రోల్ ను త్వరలో తీసుకువస్తారంటూ కొందరు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని కేంద్రం పేర్కొంది. ప్రజల్లో భయాందోళనలు, గందరగోళం సృష్టించడానికి కొందరు ఇలాంటివి వ్యాప్తి చేస్తున్నారని, వాటిని నమ్మవద్దని కోరింది. నిబంధనల ప్రకారం, అన్ని దశల పరీక్షల్లో సత్ఫలితాలు వచ్చాకనే ఇథనాల్ బ్లెండిక్ ప్రక్రియను తీసుకువచ్చామని చెప్పింది. ఈ20 పెట్రోల్ పూర్తిగా సురక్షితమైనందని స్పష్టం చేసింది. దేశంలో ఇథనాల్ కలిపిన పెట్రోల్ తో సుమారు 20 కోట్ల ద్విచక్ర వాహనాలు, 20 లక్షల ఫోర్ వీలర్లు నడుస్తున్నాయని, వాటిలో ఎలాంటి సమస్యలు రాలేదని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం, 2023 ఏప్రిల్ నుంచి ఈ15 బ్లెండింగ్ అమలులో ఉంది. 2024 ఏప్రిల్ లో ఈ19 బ్లెండింగ్ అమలు చేశారు. 2025 నుంచి దశలవారీగా ఈ20 బ్లెండింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. కాగా ప్రస్తుతం వివిధ రకాల ఆటోమొబైల్ బ్రాండ్లు, వాహన విభాగాల్లో ఈ25 అనుకూలత గురించి పరీక్షలు జరుగుతున్నాయి. వీటికి సంబంధించిన తుది నివేదికలు ఇంకా ప్రభుత్వానికి అందలేదు. అందువల్ల పరీక్షలన్నీ పూర్తయ్యే వరకు ఎలాంటి పాలసీ నిర్ణయం తీసుకోరు. భవిష్యత్తులో ఇథనాల్ బ్లెండింగ్ పెంచడం అనేది పూర్తిగా వాహన భద్రత, ఇంజిన్ పనితీరు, ఇంధన సామర్థ్యం, మైలేజీ, దీర్ఘకాలిక మన్నిక, తయారీదారుల ధ్రువీకరణకు సంబంధించిన శాస్త్రీయ ఆధారాలపై నిర్ణయమవుతుంది. ప్రస్తుతానికైతే ఈ25 కోసం ఎలాంటి ప్రతిపాదనలు లేవు.

### ఇథనాల్ బ్లెండింగ్ ను ప్రభుత్వం ఎందుకు ప్రోత్సహిస్తోంది?

ముడిచమురు దిగుమతులపై ఆధారపడడం తగ్గించడం, ఇంధన దిగుమతి బిల్లులు తగ్గించడం, కార్బన్ ఉద్గారాలను అరికట్టడం లాంటి లక్ష్యాలతో ప్రభుత్వం ఈ ఇథనాల్ బ్లెండింగ్ ను ప్రోత్సహిస్తోంది.




భారతదేశంలో ప్రధానంగా చెరకు, ఆహార ధాన్యాల నుంచి ఉత్పత్తి చేసే ఇథనాల్ , దేశ ఇంధన భద్రతను మెరుగుపరచడమే కాకుండా, రైతులకు అదనపు ఆదాయ అవకాశాలను అందిస్తుందని భావిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎక్కువగా ముడి చమురు వినియోగిస్తున్న దేశాల్లో భారత్ ఒకటిగా ఉంది. అంతర్జాతీయంగా జరుగుతున్న ముడిచమురు దిగుమతుల్లో భారత్ కే 30 శాతం వరకు కొనసాగుతున్నాయి. అందుకే దీనిని తగ్గించేందుకు రవాణా ఇంధనాల వైవిధ్యీకరణ వ్యూహాత్మక ప్రాధాన్యతగా మారిందని అధికారులు తెలిపారు. ఇలాంటి తరుణంలో దేశంలో ఇథనాల్ బ్లెండింగ్ గురించి భయాందోళనలు సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇంధన స్వావలంబన వైపు భారతదేశం వేస్తున్న అడుగులను దెబ్బతీసేందుకు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని వారు తెలిపారు. భారత్ శిలాజ ఇంధనాలపై ఆధారపడడాన్ని తగ్గించుకోవాలని చూస్తోంది. అయితే ఇది ఇష్టం లేని కొన్ని అంతర్జాతీయ శక్తులు ప్రజల్లో భయాందోళనలు కలిగించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నాయని విశ్వసనీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఫ్లెక్స్ -ఫ్యూయల్ వాహనాల కోసం ఈ85 ఇంధనాన్ని తీసుకురావడం గ్లోబల్ క్రూడ్ ఆయిల్ , బ్యాటరీ ఎకోసిస్టమ్ లోని కొన్ని విభాగాలను కలవరపరిచిందని, అందుకే విదేశీ లాబీలు భారత వినియోగదారులను భయాందోళనకు గురిచేసే, తప్పుదోవ పట్టించే ప్రచారాలు, నకిలీ వీడియోలకు నిధులు సమకూరుస్తున్నారని సదరు వర్గాలు తెలిపాయి.

### ఈ సమస్యలు ఉన్నాయ్

ఈ20 ఇంధనాన్ని నిర్దిష్ట మోడళ్లకు మాత్రమే వాడాలని కొన్ని తయారీ సంస్థలు వినియోగదారులకు సూచించాయి. ముఖ్యంగా అధిక ఇథనాల్ కంటెంట్ కోసం రూపొందించని పాత వాహనాల్లో మైలేజ్ తగ్గడం, ఇంజిన్ అరుగుదల, నిర్వహణ ఖర్చులు పెరగడం లాంటి సమస్యలు ఉన్నాయి.

# సంపాదకీయం

## ఐశ్వర్యం నీడలో అప్పుల బతుకులు!

సంపద పోగుపడుతోంది, సామాన్యుల సంక్షేమం సన్నగిల్లుతోంది! వృద్ధిరేటు, ద్రవ్యోల్బణం శాతాలు మొదలైన స్థూల ఆర్థిక సూచికలు భారత ఆర్థిక వ్యవస్థ ఆరోగ్యదాయకంగా, పురోగమన పథంలో ఉన్నదని మనకు విదితం చేస్తాయి. సగటు కుటుంబ బడ్జెట్‌ను పరిశీలించండి. స్థూల ఆర్థిక సూచికలు ఆవిష్కరిస్తున్న దృశ్యానికి భిన్నమైన వాస్తవ చిత్రం మనకు కనపడుతుంది. స్పష్టంగా చెప్పాలంటే మన దేశ ఆర్థిక వ్యవస్థ ఏమంత శ్రేయోదాయకంగా లేదు. సంపద సృష్టికర్తలైన అత్యధిక ప్రజలకు నిజమైన సంక్షేమం లభించడం లేదు. గత పన్నెండు సంవత్సరాలుగా ఆర్థిక వ్యవస్థ సృష్టిస్తున్న సంపద, వ్యక్తిగత కొనుగోలు శక్తి ఒక వ్యక్తి తన ఆదాయంతో సమకూర్చుకోగల సరుకులు, సేవలు మధ్య అతి ముఖ్యమైన లంకె తెగిపోయింది. అనేక వృత్తులు, ఉద్యోగాలలో వాస్తవ వేతనాలు (ద్రవ్యోల్బణానికి అనుగుణంగా సర్దుబాటు చేసినవి) పెరగలేదు. అసంఖ్యాక శ్రామిక కుటుంబాలు తమ జీవన వ్యయాలకు రుణాలు తీసుకోవల్సిన అగత్యంలో ఉన్నాయి. ఇదొక నిష్ఠుర నిజం. క్రెడిట్ కార్డు రుణాలపై ఆధారపడుతున్న వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. అంతకంటే ముఖ్యంగా పదే పదే ఆ రుణాలు తీసుకోవడమూ పెరుగుతోంది. బంగారు ఆభరణాలు మొదలైన స్త్రీ ధనాన్ని తాకట్టు పెట్టి రుణాలు తీసుకోవడమూ విరివిగా జరుగుతోంది. స్తంభించిన వేతనాలు, పెరుగుతున్న వినియోగ వ్యయాలకు మధ్య అంతరాన్ని పూడ్చుకునేందుకు రుణాలు చేయడం తప్పనిసరి అయిపోయింది. వర్తమాన జీవన వాస్తవమిది. మన సమాజంలో ఇప్పుడు వేతనరుణ సంక్షోభం ఎంత తీవ్రంగా ఉన్నది ఆ కఠోర వాస్తవం స్పష్టం చేస్తోంది. వేతనాలు వస్తున్నాయి. అవి సరిపోవడం లేదు. అప్పులు చేయడం అనివార్యమవుతోంది. విశేషమేమిటంటే అవి సులభంగా లభిస్తున్నాయి. వాటిని తీర్చడమే సమస్యవుతోంది. వేతన ఆదాయం జీవన వ్యయాలకు సరిపోకపోవడమే అందుకు కారణం. తత్ఫలితంగా శ్రామిక శ్రేణులు అపాయకరమైన ఆర్థిక దుస్థితిలోకి జారిపోతున్నాయి. భారతీయ కార్మికుల ఆర్థిక ఇక్కట్లకు ధరల పెరుగుదలను కారణంగా చూపడం సమంజసం కాదు. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా చమురు సరఫరాలకు అంతరాయం కలగడంతో ధరలు పెరిగిన మాట నిజమే. అయితే మనుగడకు రుణాలు తీసుకోవల్సిన అగత్య మేర్పడడానికి కారణం అది మాత్రమే కాదు. జాతి సంపద సృష్టి అవుతున్న, పంపిణీ జరుగుతున్న తీరు తెన్నులే ఆ అసంగత పరిస్థితికి కారణాలని చెప్పి తీరాలి. ఆర్థిక వ్యవస్థ సుస్థిరంగా పురోగమిస్తోంది. స్టాక్ మార్కెట్ సూచీలు సదా ఊర్ధ్వ దిశలో ఉంటున్నాయి. అయితే పెరుగుతున్న జాతి సంపద, దానిని సృష్టించడంలో కీలకపాత్ర వహిస్తున్న శ్రామిక శ్రేణులకు సక్రమంగా, న్యాయబద్ధంగా పంపిణీ అవుతుందా? లేదు అనేదే కచ్చితమైన సమాధానం. వేతన అంతరాలు సుదీర్ఘకాలం కొనసాగితే దాని ప్రభావం స్థూల ఆర్థిక వ్యవస్థపై కూడా ఉంటుందనే వాస్తవాన్ని మనం విస్మరించకూడదు. వేతనాలు బెత్తెడుగా ఉండిపోవడం, వ్యయాలు బారెడు కావడం వల్లే భారతీయ కుటుంబాల నికర పొదుపు మొత్తాలు రికార్డు స్థాయిలో తగ్గిపోతున్నాయి. స్థూల జాతీయ వినియోగ ఆదాయం (జీఎన్‌డీఐ)లో 7 నుంచి 8శాతంగా ఉండే ఈ పొదుపు మొత్తాలు 202223 ఆర్థిక సంవత్సరంలో 5.2శాతానికి తగ్గిపోయాయి. అయితే స్థిర, చరాస్తులు తాకట్టు పెట్టి తీసుకునే రుణాలు 2014లో 3శాతం నుంచి 2023లో 5.7శాతానికి పెరిగాయి. ఫలితంగా చెల్లించవలసిన అప్పుల మొత్తాలు కూడా గణనీయంగా పెరిగిపోయాయి. కోవిడ్ ఉపద్రవంలో కుదేలయిన దేశ ఆర్థిక వ్యవస్థ ఆ తరువాత బాగా కోలుకున్నదనడంలో సందేహం లేదు. అయితే ఈ ఆర్థిక పునరుద్ధరణ వేతనాల నైష్పత్తిక పెరుగుదల వల్ల కాకుండా కార్పొరేట్ లాభాల పెరుగుదల వల్లే అన్నది ఒక చేదు సత్యం. 201425 సంవత్సరాల మధ్య అనియత కార్మికుల వాస్తవ వేతనాల వార్షిక పెరుగుదల రేటు 1.5శాతం కంటే తక్కువగా ఉన్నది. ఈ వేతన అణచివేతకు తోడు పట్టణ ప్రాంతాలలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కొరవడడంతో శ్రామిక శ్రేణుల జీవన పరిస్థితులు మరింత అధ్వానమయ్యాయి. పైగా 201819 సంవత్సరం నుంచి తిరోగమన వలసలు (ఉద్యోగాలు హరించుకుపోవడం, ఉపాధి అవకాశాలు మృగ్యమవడంతో పట్టణాలు, నగరాలకు వలసలు వచ్చినవారు తమ స్వస్థలాలకు తిరిగి వెళ్లిపోవడం) పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. మరింత స్పష్టంగా చెప్పాలంటే వ్యవసాయేతర రంగాల నుంచి వ్యవసాయరంగ ఉపాధులకు లక్షలాది శ్రామికులు తిరిగి వెళ్ళిపోతున్నారు. వేతనాల పెరుగుదలకు ప్రత్యామ్నాయంగా రుణలబ్ధి అవకాశాలు ఇతోధికంగా పెరిగాయి. దేశ ఆర్థిక వ్యవస్థ పురోగతికి అదెంతవరకు ఉపకరిస్తుంది? సమాధానం స్పష్టమే. వేతనాలు పెరగకపోయినా రుణలబ్ధి అవకాశాలు ఇతోధికమవడంతో వినియోగదారు రుణాల స్వభావం మౌలికంగా మారిపోయింది. కుటుంబ రుణాలు ఇతోధికంగా పెరిగిపోవడం కంటే శ్రామిక ప్రజలు తమ జీవన వ్యయాల కోసం గణనీయంగా ఆ రుణాలపై ఆధారపడుతున్న పరిస్థితే బాగా కలవరపరుస్తోంది. ఇది దేశానికి ఎంతమాత్రం శ్రేయస్కరం కాదని ఆర్థిక నిపుణులు ఆందోళన చెందుతున్నారు. ఈ అత్యవసర రుణాలు దేశ ప్రగతికి ఆటంకమవుతాయని పలువురు హెచ్చరిస్తున్నారు. సంప్రదాయంగా భారతీయ కుటుంబాలు తమకు డబ్బు అవసరమయినప్పుడు గృహాలు, పొలాలు, బంగారం మొదలైన వాటిని తనఖా పెట్టడం పరిపాటి. దీనివల్ల వారి తక్షణావసరాలు తీరడంతో పాటు స్థిర, చరాస్తుల రూపంలో భద్ర భవిష్యత్తును సమకూర్చుకునేందుకు కూడా దోహదం జరిగేది. మనుగడ కోసమే రుణాలు తీసుకోవలసిరావడం పరిస్థితులను సంక్లిష్టం చేస్తోంది. సురక్షితం కాని వ్యక్తిగత రుణాలు, వినియోగదారు రుణాల వార్షిక

# అమెరికా వ్యూహానికి పాక్ గండి!



పాకిస్థాన్‌తో అమెరికా వ్యూహాత్మక సంబంధాలను పెంచుకుంటున్న తరుణంలోనే, ఇస్లామాబాద్ చైనాకు దగ్గరవుతోంది. తైవాన్, దక్షిణ చైనా సముద్రం, సీపీఈసీ ప్రాజెక్టు సహా అనేక అంశాలపై బీజింగ్ విస్తృత వ్యూహాత్మక విధానాలకు పాక్ వంతపాడుతోంది. రోజురోజుకూ బలపడుతున్న చైనా-పాక్ పొత్తు అమెరికా ఇండో-పసిఫిక్ వ్యూహంపైనా, దిల్లీతో వాషింగ్టన్ దీర్ఘకాలిక భాగస్వామ్యంపైనా తీవ్ర సందేహాలను లేవనెత్తుతోంది. అమెరికా ఇండో-పసిఫిక్ వ్యూహం మొత్తం ఈ ప్రాంతంలో స్థిరత్వాన్ని కాపాడటం, బలాబలాల సమతుల్యతను నిలబెట్టడం, నౌకాయాన స్వేచ్ఛకు భరోసా ఇవ్వడం, తైవాన్‌ను చైనా బలప్రయోగంతో విలీనం చేసుకోకుండా నిరోధించడం అనే సూత్రాలపై ఆధారపడి ఉంది. అయితే, వాషింగ్టన్ వ్యూహానికి పాకిస్థాన్ గండి కొడుతోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు అత్యంత ఇష్టుడైన ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్, పాక్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్‌లు మొన్న మే నెలలో చైనాలో పర్యటించినప్పుడు విడుదలైన చైనా, పాక్‌ల సంయుక్త ప్రకటనను ఇక్కడ గమనించాలి. 'ఒకే చైనా సూత్రానికి తన నిబద్ధతను పాకిస్థాన్ గట్టిగా పునరుద్ఘాటిస్తోంది. పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనాలో తైవాన్ విడదీయరాని భాగమని స్పష్టం చేస్తోంది' అని అది స్పష్టీకరించింది. ఆ ప్రకటన ఇంకా ఇలా పేర్కొంది- 'జాతీయ పునరేకీకరణ (చైనాతో తైవాన్ విలీనాన్ని) సాధించడానికి బీజింగ్ చేసే అన్ని ప్రయత్నాలకూ పాకిస్థాన్ గట్టి మద్దతు ఇస్తుంది. తైవాన్ స్వాతంత్ర్యాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. షింజియాంగ్, షిజాంగ్(టిబెట్), హాంకాంగ్, దక్షిణ చైనా సముద్రానికి సంబంధించిన అంశాలపై చైనా అనుసరిస్తున్న న్యాయమైన వైఖరికి పాకిస్థాన్ పూర్తి మద్దతు ఇస్తుంది. తన జాతీయ సార్వభౌమత్వాన్ని, స్వాతంత్ర్యాన్ని, ప్రాంతీయ సమగ్రతను రక్షించుకోవడంలో, దేశ భద్రత, స్థిరత్వం, అభివృద్ధి, శ్రేయస్సును కాపాడుకోవడంలో పాకిస్థాన్‌కు అచంచలమైన మద్దతు ఇస్తానని చైనా పునరుద్ఘాటించింది'. ఈ ప్రకటన పర్యవసానాలు చాలా ముఖ్యమైనవని గుర్తుంచుకోవాలి. ఓవైపు ట్రంప్ ఏమో మునీర్, షెహబాజ్‌లను ప్రశంసిస్తున్నారు. మరోవైపు పాకిస్థాన్, బీజింగ్ దూకుడు చర్యలను సమర్థిస్తూ ఇండో-పసిఫిక్ ప్రాంతంలో అమెరికా ప్రయోజనాలను బహిరంగంగానే దెబ్బతీస్తోంది. చైనా-పాక్ సంయుక్త ప్రకటన తైవాన్‌కే కాకుండా, ప్రతి ఇండో-పసిఫిక్ దేశానికీ ఆందోళనకర విషయం.

### బీజింగ్‌కు ఇస్లామాబాద్ వంత

అమెరికా నేతృత్వంలోని ప్రపంచ వ్యవస్థను బలహీనపరచి, చైనా సారథ్యంలో నూతన ప్రపంచ వ్యవస్థను రూపొందించే ప్రయత్నాలకు బీజింగ్, ఇస్లామాబాద్ సంయుక్త ప్రకటన మద్దతు పలికింది. 'చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ప్రతిపాదించిన కమ్యూనిటీ విత్ ఎ షేర్డ్ ఫ్యూచర్ ఫర్ హ్యూమానిటీ, గ్లోబల్ డెవలప్‌మెంట్ ఇనిషియేటివ్, గ్లోబల్ సెక్యూరిటీ ఇనిషియేటివ్, గ్లోబల్ సివిలైజేషన్ ఇనిషియేటివ్, గ్లోబల్ గవర్నెన్స్ ఇనిషియేటివ్‌లకు పాక్ మద్దతు ఇస్తోంది' అని అందులో స్పష్టంగా పేర్కొన్నారు. అంతర్జాతీయ ఆర్థికాభివృద్ధి, భద్రత, పరిపాలన, నాగరికతల వికాసానికే ఈ పథకాలను చేపడుతున్నానని డ్రాగన్ ఉద్ఘాటిస్తోంది. వీటిని పాక్ సమర్థిస్తోంది. రెండు దేశాలు అమెరికా ఏకపక్ష చర్యలను పరోక్షంగా విమర్శిస్తూ, వాటిని ఫాసిజం, మిలిటరిజం కోణంలో ప్రస్తావించాయి. పైగా రెండో ప్రపంచ యుద్ధంలో చిత్తయిన ఫాసిజం, సైనిక దుస్సాహసాలను పునరుద్ధరించే ప్రయత్నాలను వ్యతిరేకించడం అత్యావశ్యకమని సంయుక్త ప్రకటన పిలుపిచ్చింది. ఈ విమర్శలు అమెరికాను ఉద్దేశించినవేనని భావించవచ్చు. బీజింగ్, వాషింగ్టన్‌ల మధ్య పెరుగుతున్న భౌగోళిక రాజకీయ పోటీలో చైనానే పాక్ బలపరుస్తోందన్నమాట. అలాగే ఏఐ, సరఫరా గొలుసుల రంగాల్లోనూ చైనాతో సహకారానికి పాకిస్థాన్ ఉవ్విళ్లూరుతోంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను పునర్నిర్మించే లక్ష్యంతో చైనా చేపట్టిన 'బెల్ట్ అండ్ రోడ్(బీఆర్ఐ)' పథకంలో ఇస్లామాబాద్ పాలుపంచుకుంటోంది. పాకిస్థాన్ గుండా నిర్మితమవుతున్న చైనా-పాక్ ఆర్థిక నడవా(సీపీఈసీ) ప్రాజెక్టు బీఆర్ఐలో భాగమే. మౌలిక సదుపాయాలు, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, ఇతర రంగాల్లో మరిన్ని 'చిన్న, అందమైన' జీవనోపాధి ప్రాజెక్టులను ప్రారంభించడానికి ఇరుపక్షాలు సిద్ధంగా ఉన్నట్లు చైనా-పాక్ సంయుక్త ప్రకటన చాటిచెప్పింది బీఆర్ఐ పథకం వర్ధమాన దేశాలను అప్పులపాలు చేస్తోందనీ, లాభంలేని ప్రాజెక్టులను చేపడుతోందనీ, చాలా దేశాల్లో ఆర్థిక అవకాశాలను కల్పించడంలో విఫలమైందనీ విమర్శలు పెరుగుతున్నాయి. సరిగ్గా ఇలాంటి తరుణంలోనే ఈ ప్రకటన వెలువడటం గమనార్హం. అందుకే చైనా ఇప్పుడు బీఆర్ఐలోని కొన్నింటిని 'చిన్న, అందమైన' ప్రాజెక్టులుగా చూపించేందుకు ప్రయత్నిస్తోంది. కశ్మీర్ విషయంలో పాకిస్థాన్ వైఖరిని చైనా సమర్థించడమే కాకుండా, సరిహద్దు నదుల విషయంలో సహకారం గురించీ ఇస్లామాబాద్‌తో చర్చించింది. దీన్ని భారత విదేశాంగశాఖ తీవ్రంగా ఆక్షేపించింది.

### తాత్కాలిక సంబంధాలట!

ఇటీవల దిల్లీ పర్యటనకు వచ్చిన అమెరికా విదేశాంగమంత్రి మార్కో రూబియో 'భారత్‌తో వ్యూహాత్మక పొత్తు'ను పదేపదే ప్రస్తావించారు. వాషింగ్టన్ ఇండియాను ఇండో-పసిఫిక్ ప్రాంతంలో దీర్ఘకాలిక వ్యూహాత్మక భాగస్వామిగా చూస్తోందని స్పష్టం చేయడానికి ప్రయత్నించారు. రూబియో తన ప్రసంగంలో పాక్‌తో వాషింగ్టన్ సంబంధాలు తాత్కాలిక ప్రయోజనాల కోసమేనని పరోక్షంగా అంగీకరించారు. 'మేము వివిధ దేశాలతో తాత్కాలికంగా కలిసి పనిచేస్తాం. భారత్ కూడా అలానే చేస్తున్నప్పటికీ, ప్రపంచంలో మరే దేశంతోనైనా మాకున్న సంబంధాలు ఇండియాతో మా వ్యూహాత్మక పొత్తుకు నష్టం కలిగించేలా ఉంటాయని నేను భావించడం లేదు' అని ఆయన పేర్కొన్నారు. ఇలా తాత్కాలిక దౌత్యానికీ, శాశ్వత వ్యూహాత్మక కూటమికీ; ఎత్తుగడలకూ, వ్యూహానికీ మధ్య ఉన్న తేడాను భారత్ గుర్తించాలని వాషింగ్టన్ ఆశిస్తోంది. నిర్దిష్టమైన తాత్కాలిక అంశాలపై అమెరికా పాకిస్థాన్‌తో సంబంధాలు కలిగి ఉన్నప్పటికీ, ఆ సంబంధాలను ఇండియాకు దూరం జరుగుతున్నట్లుగా భావించకూడదని రూబియో సూచించారు. అయితే, ఇస్లామాబాద్ కోసం భారత్‌తో తన భాగస్వామ్యాన్ని అమెరికా బలహీనపరచుకుంటూ... ఇండో-పసిఫిక్ ప్రాంతంలో, ముఖ్యంగా తైవాన్ విషయంలో తన సొంత ప్రయోజనాలను దెబ్బతీసుకోకుండా జాగ్రత్త వహించాల్సి ఉంది.

# పుణ్యక్షేత్రాల్లో దోపిడీ.. భక్తుల విశ్వాసానికి పరీక్ష!



అయోధ్య రామమందిరం కోట్లాది హిందువుల విశ్వాసానికి ప్రతీక. అలాంటి పవిత్ర క్షేత్రానికి భక్తులు సమర్పించిన విరాళాల నిర్వహణపై ఇటీవల వెలుగులోకి వచ్చిన ఆరోపణలు దేశవ్యాప్తంగా చర్చకు దారితీశాయి. హుండీ నగదు, బంగారంవెండి కానుకలు, భూముల కొనుగోళ్లు, ట్రస్ట్ పరిపాలనలో పారదర్శకత వంటి అంశాలపై వివాదాలు తలెత్తడంతో, సమగ్ర దర్యాప్తు జరిపి వాస్తవాలను వెలికి తీయాలనే డిమాండ్ బలపడుతోంది. ఈ ఆరోపణల నిజానిజాలు దర్యాప్తులో తేలాల్సి ఉన్నప్పటికీ, దేవాలయాల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం ఎంత అవసరమో మరోసారి గుర్తు చేస్తున్నాయి. అటు ఓట్లు, ఇటు నోట్లు దండుకోవడానికి 'భక్తి'కంటే పెద్ద అడ్డదారి ఏముంటుంది? అనే చేదు నిజానికి ఈ వందల కోట్ల కుంభకోణమే నిదర్శనం. రామమందిర ట్రస్ట్‌లో భక్తి అనేది వ్యాపారంగా, రాజకీయ గెలుపు గుర్రంగా మారింది. దేశంలోని ప్రజలు దాచి ఇచ్చిన పవిత్ర విరాళాలను, ఆధ్యాత్మిక ముసుగులో ఉన్నవారే కాజేస్తూ దొరికిపోవడం సాధారణ అవినీతి కాదు. దేవుడి పేరుతో జరిగిన గుండె చీల్చే నమ్మక ద్రోహం. ఓట్ల వేట కోసం దేవుడిని, నోట్ల వేట కోసం భక్తుల నమ్మకాన్ని తాకట్టు పెట్టిన ఈ దైవద్రోహంపై సమాజం నేడు జాగృతం కావాల్సిన అవసరం ఉంది.

### భక్తుల విరాళాల సొమ్ముతో..

ఈ వ్యవస్థీకృత దోపిడీ వెనుక నమ్మశక్యం కాని దారుణాలు దాగున్నాయి. విశ్వ హిందూ పరిషత్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ మాజీ డ్రైవర్ 'టిన్నూ' హుండీ తాళాలు చేతిలో పెట్టుకొని దొంగ తనాలు చేస్తున్నారు. సిట్ దర్యాప్తులో కోట్ల రూపాయలు రికవరీ అయ్యాయి. ఈ పాపపు సొమ్ముతో నిందితులు రాత్రికి రాత్రే లగ్జరీ కార్లు, ప్లాట్లు కొన్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. భక్తుల సొమ్మును పేడకుప్పల కింద, అలమరాల్లో దాచడం ఘోర అవమానకరం. నగదు లెక్కింపు సమయంలో రూ. 6 నుంచి రూ. 8 లక్షలు నిత్యం నొక్కేస్తూ, నోట్ల కట్టలను జేబుల్లో, సాక్సుల్లో దాచి తరలించారు. దొంగతనం దాచేందుకు 180 రోజుల సీసీటీవీ ఫుటేజీని 45 రోజులకే డిలీట్ చేశారు. చంపత్ రాయ్ బంధు వర్గమైన బన్సల్ కుటుంబం ఆలయ పవిత్రత నీడలోనే కోట్ల రూపాయల రియల్ ఎస్టేట్ సామ్రాజ్యాన్ని నడిపిన సత్యాలు బయటకొస్తున్నాయి. అంతేకాదు భక్తులు సమర్పించిన బంగారు, వెండి కానుకలను కరిగించి 'బంగారు బిస్కట్లు'గా మార్చేసినట్టు తెలుస్తోంది. ఓ న్యూస్ ఛానల్ స్టింగ్ ఆపరేషన్ ప్రకారం.. చంపత్ రాయ్‌తో చేతులు కలిపి దాదాపు 200 మందితో కూడిన ఒక భారీ లూటీ నెట్వర్క్ అయోధ్యలో కానుకలు దొంగిలించి, కర్ణాటకకు తరలించి కరిగించే దందా నడిపారనే ఆరోపణలు ఉన్నాయి. ముంబై భక్తుడు ఆలయ సిబ్బంది కోసం పంపిన రెండు ట్రక్కుల స్వెటర్లలో.. కేవలం 40 మాత్రమే ఇచ్చి, మిగిలినవన్నీ ట్రస్టు సీనియర్ సభ్యుడు అనిల్ మిశ్రా మార్కెట్లో అమ్ముకున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

### ఇంత జరుగుతున్నా.. సమాచారం ఇవ్వకుండా..

అన్నిటికంటే పరాకాష్టగా, కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి సమర్పించిన రూ. 5 కోట్ల విలువైన, 147 కిలోల బంగారు 'రామచరిత్ మానస్' గ్రంథాన్ని కూడా ప్రదర్శన నుంచి మాయం చేసేశారు. ఈ పవిత్ర విరాళాలను కాపాడాల్సిన వారి నిర్లక్ష్యం భక్తుల హృదయాలను నట్టేట ముంచింది. తాజాగా వెలుగులోకి వచ్చిన భూముల బేరం ఈ కుంభ కోణంలో మరో పెద్ద సంచలనం ఆలయ నిర్మాణానికి వాడిన 1.59 ఎకరాల భూమిని జిల్లా యంత్రాంగం ముందే 'ప్రభుత్వ భూమి'గా ప్రకటించినప్పటికీ, అదే భూమిని శ్రీరామజన్మభూమి ట్రస్టు ఒక ప్రైవేటు వ్యక్తి నుంచి రూ. 23.61 కోట్లకు కొనుగోలు చేయడం తీవ్ర దుమారం రేపుతోంది. గతంలోనూ రూ. 2 కోట్ల భూమిని కేవలం ఐదు నిమిషాల వ్యవధిలో రూ. 18.5 కోట్లకు ట్రస్టుకు అమ్మడం వెనుక, నకిలీ ప్రసాదం పేరిట రూ. 3.85 కోట్ల సైబర్ మోసాల వెనుక పెద్ద ఎత్తున అవినీతి జరిగింది. భక్తులు సమర్పిస్తున్న కానుకలపై తమకు ఎలాంటి హక్కు ఉండబోదన్న హామీ పత్రాన్ని కూడా ట్రస్టు అధికారులు బలవంతంగా తీసుకుంటున్నారని తేలింది. ఇంత జరుగుతున్నా, ఆర్టీఐ కింద ట్రస్టు రికార్డులు ఇస్తే 'ప్రాణాలకే ముప్పు' అంటూ కేంద్ర హోంశాఖ సమాచారాన్ని తొక్కిపెట్టడం పలు అనుమానాలకు తావిస్తోంది.

### బద్రినాథ్ ఆలయంలోనూ దోపిడీ ఆరోపణలు..

ఈ దైవద్రోహం తీవ్రత ఇప్పుడు దేశవ్యాప్తంగా రాజకీయ, సామాజిక ఒత్తిడిని పెంచుతోంది. స్వయంగా ప్రధాని పాల్గొన్న రామమందిరంలోనే ఇలా వందల కోట్ల దోపిడీకి తెగబడితే, ఇక దేశంలో ఉన్న ఇతర సాధారణ మందిరాలలో జరిగే అక్రమాలకు అడ్డేముంటుంది?. ఆశ్చర్యకరంగా, హిమాలయాల్లోని పవిత్ర 'బద్రినాథ్' ఆలయంలో సైతం ట్రస్టు చైర్మన్ పీఏనే భక్తుల కానుకలు కాజేశాడంటూ దర్యాప్తు కమిటీని వేశారు. దేశంలోని పవిత్ర పుణ్యక్షేత్రాలన్నీ ఇలాంటి భక్తి ముసుగు దొంగల పాలవడం హిందూ సమాజానికి కోలుకోలేని దెబ్బ. 'ఓటు చోరీ, సీటు చోరీ, చందాల చోరీ.. ఇదే బీజేపీ వ్యూహం' అంటూ విపక్షాలు గర్జిస్తుంటే, స్థానిక న్యాయవాదులే నేడు ట్రస్టీలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆందోళనకు దిగారు. రామాయణంలో రాముడు ధర్మానికి ప్రతీక అనే భావన ఉంది. "రామో విగ్రహవాన్ ధర్మః" మరి ఆ ధర్మం ఇప్పుడు ఎక్కడ ఉంది? భక్తిని రాజకీయం చేస్తూ, దేవుడి పేరిట సాగుతున్న ఈ ఆర్థిక, అధికార దౌర్జన్య పాలనను సమాజం ప్రశ్నించాలి. సిట్ దర్యాప్తు పూర్తి స్వేచ్ఛగా జరిగి, సూత్రధారులందరినీ చట్టం ముందు నిల బెట్టాలి. సత్యం, పారదర్శకత లేని ఆరాధన వ్యర్థం.

# అప్పులపై అబద్ధాలు.. కాళేశ్వరంపై కుట్రలు



కాళేశ్వరం ప్రాజెక్టు మీద, తెలంగాణ అప్పుల మీద కాంగ్రెస్ చేసిన, చేస్తున్న దుష్ప్రచారం అంతాఇంత కాదు. ఆరు గ్యారంటీలు, 420 హామీలు గుప్పించి గోబెల్స్‌ను మించి అబద్ధాలను వల్లెవేశారు. అదే నిజమని కొందరు ప్రజలు ఆశపడ్డారు. కాంగ్రెస్‌కు అధికారాన్ని కట్టబెట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పరిపాలన చేయాల్సిందిపోయి మళ్లీ అదే పనిగా బీఆర్ఎస్‌పై, కేసీఆర్ హయాంలో జరిగిన అప్పులపై అబద్ధాలు చెప్పడం మొదలుపెట్టారు. రెండున్నరేండ్ల పాలనలో విఫలమై తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకొన్నందుకు మళ్లీ అదే పాత సూత్రాన్ని కాంగ్రెస్ నేతలు అందుకుంటున్నారు. తెలంగాణలో టీఆర్ఎస్ 2014లో ప్రభుత్వం ఏర్పాటుకు ముందు సమైక్య రాష్ట్రం నుంచి వచ్చిన అప్పు రూ.84,268 కోట్లు. ఇది రాష్ట్ర విభజన సందర్భంగా వారసత్వంగా వచ్చిన అప్పు. 2023 డిసెంబర్ 7 నుంచి 2024 మార్చి 31 వరకు కాంగ్రెస్ పాలనలో ఎఫ్ఆర్‌బీఎం ద్వారా రూ.15,118 కోట్లు తీసుకుని దానిని బీఆర్ఎస్ ప్రభుత్వ లెక్కలో వేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటికి ప్రభుత్వంపై ఉన్న మొత్తం బకాయి రూ.5,16,881 కోట్లు. సమైక్య రాష్ట్రంలో నుంచి వచ్చిన అప్పు, కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్‌పై నెట్టిన అప్పు తీసేస్తే మొత్తం బీఆర్ఎస్ తొమ్మిదిన్నరేండ్ల పాలనలో చేసిన అప్పు రూ.4,17,495 కోట్లు. ఈ విషయాన్ని ఒకటికి పదిసార్లు మాజీ మంత్రి హరీశ్‌రావు అసెంబ్లీలో, బహిరంగ సభలు, అనేక సమావేశాలు, ప్రెస్‌మీట్‌ల ద్వారా ఆధారాలతో నిరూపించారు. తెలంగాణ బడ్జెట్ ఇన్ బ్రీఫ్ 2025-2026 14వ పేజీలో బీఆర్ఎస్ సర్కార్ ఎఫ్ఆర్‌బీఎం పరిధిలో తీసుకున్న అప్పు రూ.3,01,484 కోట్లు + రూ.1,09,335 కోట్లు = రూ.4,10,819 కోట్లు. ఇది కాంగ్రెస్ పార్టీనే తమ బడ్జెట్‌లో పెట్టిన లెక్క. కాగ్ రిపోర్ట్ ప్రకారం..బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పు రూ.4,10,819 కోట్లు. 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ విడుదల చేసిన శ్వేతపత్రంలోని లెక్కల ప్రకారం బీఆర్ఎస్ చేసిన అప్పు రూ.4,17 లక్షల కోట్లు. పదేపదే అబద్ధాలు చెప్తూ, సవాళు విసురుతూ మంత్రులు కాలుదువ్వడం.. ఆ సవాళ్లను బీఆర్ఎస్ నేతలు హరీశ్‌రావు, కేటీఆర్ స్వీకరించి ఆధారాలతోపాటు చర్చకు వెళ్తే మంత్రులు తోకముడిచారు. బీఆర్ఎస్ నేతలను అరెస్టు చేసి తమ అసమర్థతను చాటుకున్నారు. వాస్తవానికి బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పుతో గొప్ప సంపదను సృష్టించింది. జిల్లాకో మెడికల్, నర్సింగ్ కాలేజీ, కలెక్టరేట్లను నిర్మించింది. అద్భుతమైన సచివాలయం, భద్రతతో కూడిన కమాండ్ కంట్రోల్ సెంటర్, కాళేశ్వరం లాంటి అనేక ప్రాజెక్టులను చేపట్టింది. రైతుబంధు, రైతు బీమాతోపాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేసింది. యాదాద్రి ఆలయ పునర్నిర్మాణం, ఉచిత కరెంట్, గొర్రెలు, చేపల పిల్లల పంపిణీ, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయను చేపట్టింది. తెలంగాణ సంపదను పెంచిన ఘనత కేసీఆర్‌దే. 2026 మార్చి 18న అసెంబ్లీలో రేవంత్‌రెడ్డి చెప్పిన లెక్క ప్రకారం రెండున్నరేండ్లలో చేసిన అప్పు రూ.3,47,294 కోట్లు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇపుడు చెప్తున్న లెక్క రూ.3,85,600 కోట్లు. ఈ అప్పుతో రాష్ట్రంలో కొత్తగా కట్టిన ఒక్క ప్రాజెక్టునైనా చూపించగలరా? మేడిగడ్డ బరాజ్‌లో రెండు పిల్లర్లు కుంగితే వాటిని రిపేర్ చేయకుండా చోద్యం చూస్తూ నాశనం చేయాలని కాంగ్రెస్ సర్కార్ చూస్తున్నది. కాళేశ్వరం ద్వారా నీళ్లు వస్తే కేసీఆర్‌కు పేరు వస్తుందనే దుర్మార్గ ఆలోచనతో ప్రాజెక్టును పడావు పెడుతున్నది. పిల్లర్ల వద్ద ఇసుక తోడటం లాంటి కుట్రలకు పాల్పడుతున్నది. ప్రతి చుక్కనూ ఒడిసి పట్టుకునే అవకాశం కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా కేసీఆర్ కల్పించారు. కాంగ్రెస్ సర్కార్ ఆ పని చేయకుండా ప్రాజెక్టుల నుంచి లక్షల క్యూసెక్కుల నీటిని రోజూ వృథాగా పోనిస్తున్నది బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తాజాగా కాళేశ్వరం ప్రాజెక్ట్ సందర్శనకు వెళ్తే అడుగడుగునా అడ్డుకునే యత్నం చేసింది. కాంగ్రెస్ దుష్టపాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పించాలని ప్రజలు కోరుకుంటున్నారు. త్వరలో ఓటు రూపంలో సమాధానం చెప్పి తీరుతామని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

## సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్న
# శ్రీలంక దిగ్గజ క్రికెట్ అర్జున్ రణతుంగ



పుట్టపర్తి : శ్రీలంక మాజీ క్రికెట్ దిగ్గజం, భగవాన్ శ్రీ సత్యసాయి బాబా చిరకాల భక్తుడు అర్జున రణతుంగ మంగళవారం పుట్టపర్తికి విచ్చేసి ప్రశాంతి నిలయంలో స్వామి మహాసమాధిని మంగళవారం దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్వామి ఆశీస్సులు పొందేందుకు వచ్చిన ఆయన ఆధ్యాత్మిక వాతావరణంలో కొంతసేపు గడిపి భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. అనంతరం శాంతి భవన్‌లో శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జే. రత్నాకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇద్దరూ ఆధ్యాత్మిక విలువలు, మానవతా సేవ, సమాజాభివృద్ధిలో సేవా కార్యక్రమాల ప్రాధాన్యత వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిసింది. ప్రపంచవ్యాప్తంగా శ్రీ సత్యసాయి బాబా సందేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, సేవా కార్యక్రమాలను మరింత విస్తరించడం వంటి అంశాలు కూడా వీరిద్దరి ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. అర్జున రణతుంగకు శ్రీ సత్యసాయి బాబాపై ఎంతోకాలంగా అపారమైన భక్తి ఉంది. అవకాశం దొరికినప్పుడల్లా పుట్టపర్తికి వచ్చి స్వామివారిని దర్శించుకోవడం ఆయన ఆనవాయితీగా కొనసాగిస్తున్నారు. ఈసారి కూడా వ్యక్తిగత ఆధ్యాత్మిక పర్యటనలో భాగంగా ప్రశాంతి నిలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రణతుంగ పుట్టపర్తి పర్యటన సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ప్రశాంతి నిలయంలో జరుగుతున్న వివిధ సేవా కార్యక్రమాలు, విద్యా, వైద్య సేవల గురించి వివరించారు. పుట్టపర్తిలో గడిపిన ఈ పర్యటన తనకు ఎంతో ఆధ్యాత్మిక ప్రశాంతతను కలిగించిందని రణతుంగ పేర్కొన్నట్లు ట్రస్ట్ వర్గాలు వెల్లడించాయి. ఈ పర్యటన భక్తులు, క్రికెట్ అభిమానుల్లో ప్రత్యేక ఆసక్తిని రేకెత్తించింది.

## జిల్లాలో 129 అంగన్‌వాడీ సహాయకురాళ్ల
# పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి : శ్రీ సత్యసాయి జిల్లాలో ఖాళీగా ఉన్న 129 అంగన్‌వాడీ సహాయకురాళ్ల (ఆయా) పోస్టుల భర్తీకి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ మరియు సాధికారత అధికారి కె. ప్రమీల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పుట్టపర్తి రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఐసీడీఎస్ ప్రాజెక్టులు మరియు నల్లచెరువు ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌లో ఈ నియామకాలు చేపడుతున్నారు. ప్రాజెక్టుల వారీగా ఓబులదేవరచెరువులో 95, పుట్టపర్తిలో 33, నల్లచెరువులో 1 పోస్టు చొప్పున మొత్తం 129 ఖాళీలు ఉన్నాయన్నారు. దరఖాస్తుల స్వీకరణ జూలై 9 నుంచి ప్రారంభమై జూలై 17 సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుంది. అర్హులైన మహిళా అభ్యర్థులు సంబంధిత ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాల్లో దరఖాస్తు పత్రాలు పొందిన అనంతరం పూర్తిచేసి అదే కార్యాలయంలో నిర్ణీత గడువులోగా సమర్పించి రశీదు తీసుకోవాలని అధికారులు సూచించారు. గడువు ముగిసిన తర్వాత వచ్చే దరఖాస్తులు ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించబోమని స్పష్టం చేశారు. అర్హతలు, ఎంపిక విధానం తదితర పూర్తి వివరాల కోసం సంబంధిత సీడీపీవో కార్యాలయాలను సంప్రదించాలని జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ మరియు సాధికారత శాఖ అధికారులు తెలిపారు.

## డిపార్ట్‌మెంటల్ పరీక్షలకు
## పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి - డీఆర్ఓ కొండయ్య

పుట్టపర్తి : స్థానిక శ్రీ సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించనున్న డిపార్ట్‌మెంటల్ పరీక్షల ఏర్పాట్లపై జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) కొండయ్య మంగళవారం సమీక్ష నిర్వహించారు. పరీక్షలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. జూలై 8న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తొలి సెషన్, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో సెషన్‌లో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జూలై 9న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చివరి పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏపీఎస్ఆర్టీసీ ద్వారా తగిన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు విద్యుత్ సరఫరా, భద్రత, ఇతర మౌలిక వసతుల ఏర్పాట్లను డీఆర్ఓ సమీక్షించారు. పరీక్షల నిర్వహణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో పోలీసు, రెవెన్యూ, విద్యుత్ శాఖల అధికారులు, ఏపీఎస్ఆర్టీసీ ప్రతినిధులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## రిజిస్ట్రేషన్ శాఖ ప్రైవేటీకరణను
# వ్యతిరేకిస్తూ దస్తావేజు లేఖరుల నిరసన



యాడికి : రిజిస్ట్రేషన్ శాఖ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, జీవో నెం.396ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ యాడికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట మంగళవారం దస్తావేజు లేఖరులు నిరసన చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం పిలుపు మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అసిస్టెంట్ సుశీలకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో బండారు రామకేశవులు, జూటూరు అబ్దుల్ రజాక్, నవీన్ కుమార్, ఈశ్వరప్ప, నరేష్, రుక్కు, దుర్గా, గంగాధర్, నాగార్జున, సుబ్బారెడ్డి, రత్నం తదితరులు పాల్గొన్నారు

## ఈ నెల 10న యాడికిలో ప్రత్యేక విద్యుత్ అదాలత్



యాడికి :విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించేందుకు ఈ నెల 10వ తేదీ (శుక్రవారం) యాడికిలోని విద్యుత్ శాఖ కార్యాలయ ఆవరణలో ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు మండల విద్యుత్ శాఖ ఏఈ విజయుడు తెలిపారు. ఈ అదాలత్‌కు సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులు జి. మధుకుమార్, సాంకేతిక సభ్యులు ఎ. శ్రీనివాసబాబు, స్వతంత్ర సభ్యురాలు డబ్ల్యూ. విజయలక్ష్మితో పాటు ఇతర అధికారులు హాజరుకానున్నారు. విద్యుత్ సంబంధిత సమస్యలు ఉన్న వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ ఫిర్యాదులను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం పొందాలని ఏఈ కోరారు.

## యాడికిలో ఘనంగా ఎమ్మార్పీఎస్ వేడుకలు

యాడికి : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ 62వ జన్మదిన వేడుకలు, ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని యాడికిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి, మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. సామాజిక న్యాయం, ఎస్సీ వర్గీకరణ సాధనకు ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ యాడికి మండల అధ్యక్షుడు పాతకుట్ల బాలు మాదిగ, మండల ప్రధాన కార్యదర్శి జానకి రాముడు మాదిగ, గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులు మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పందు శ్రీరాములు, నరసింహులు, సూర్యుడు,వెంకటరాముడు, కుళ్లాయప్ప తదితర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# రంజిత్ హోటల్ అక్రమ నిర్మాణంపై ఎందుకీ మౌనం..?

అనుమతులకు విరుద్ధంగా అదనపు

అంతస్తులు.. టౌన్ ప్లానింగ్

పర్యవేక్షణ ఎక్కడ..?

వరుస కథనాలు వెలువడుతున్నా కదలని

అధికార యంత్రాంగం

ప్రారంభ దశలోనే ఎందుకు అడ్డుకోలేదు..?

డిప్యూటీ కమిషనర్ జోక్యం చేసుకుని

విచారణకు ఆదేశిస్తారా..?




సికింద్రాబాద్ జోన్ ప్రతినిధి / **(దిక్సూచి ప్రతినిధి):** సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ఆర్టీసీ బస్ స్టాండ్ సమీపంలోని రంజిత్ హోటల్ భవనంలో అనుమతులకు విరుద్ధంగా అదనపు అంతస్తుల నిర్మాణం జరుగుతోందనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. నిర్మాణం ప్రారంభమైనప్పటి నుంచి ప్రస్తుతం ఫినిషింగ్ దశకు చేరుకునే వరకు సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా నిర్మాణ అనుమతులను అతిక్రమించి పనులు ప్రారంభమైన వెంటనే టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీ చేసి నిర్మాణాన్ని నిలిపివేయాల్సి ఉంటుంది. అయితే ఈ నిర్మాణం స్లాబ్, అదనపు అంతస్తులు, ప్రస్తుతం ఫినిషింగ్ దశ వరకు చేరినా చర్యలు తీసుకోకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోందని స్థానికులు పేర్కొంటున్నారు.

### క్షేత్రస్థాయి సిబ్బంది నివేదికలు సక్రమంగానే ఉన్నాయా..?



ప్రతి నిర్మాణాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు సమర్పించాల్సిన బాధ్యత సంబంధిత సిబ్బందిదే. ఈ నిర్మాణం అధికారుల దృష్టికి రాలేదా? ఒకవేళ వచ్చినట్లయితే చర్యలు ఎందుకు తీసుకోలేదు? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. పర్యవేక్షణ వ్యవస్థ సమర్థంగా పనిచేస్తుందా అనే సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

### డిప్యూటీ కమిషనర్ దృష్టికి వెళ్లిందా..?

సికింద్రాబాద్ జోన్ బోయిన్ పల్లి సర్కిల్ ప్రధాన ప్రాంతంలో జరుగుతున్న ఈ నిర్మాణంపై ఉన్నతాధికారులకు సమాచారం అందిందా? ఒకవేళ అందితే సంబంధిత ఫైళ్లపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? లేక క్షేత్రస్థాయి నివేదికల ఆధారంగానే వ్యవహారం కొనసాగుతోందా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉందని ప్రజలు కోరుతున్నారు. ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజల ముందుంచాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఈ వ్యవహారంపై డిప్యూటీ కమిషనర్ ప్రత్యేక విచారణకు ఆదేశిస్తారా?

### ఇప్పటికైనా స్పందిస్తారా..?

ప్రజల్లో వ్యక్తమవుతున్న సందేహాలకు తెరదించేందుకు జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు ఈ అంశంపై అధికారికంగా స్పందించి, వాస్తవాలను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. అక్రమ నిర్మాణాల విషయంలో పారదర్శకంగా వ్యవహరిస్తేనే ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని అభిప్రాయపడుతున్నారు

## పోతుకుంట గ్రామంలో వడ్డెర సంఘం నాయకులకు
## ఘన స్వాగతం  వడ్డెర సమస్యలపై కుంచపు వడ్డే వెంకటేశులు చర్చ

సత్యసాయి జిల్లా,ధర్మవరం,: సత్యసాయి జిల్లా ధర్మవరం మండలం పోతుకుంట గ్రామానికి చెందిన ఆలకుంట గుర్రప్ప అల్లుడు దలవాయి రవి ఆహ్వానం మేరకు వారి నివాసంలో నిర్వహించిన ఆత్మీయ విందు కార్యక్రమానికి వడ్డెర సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు కుంచపు వడ్డే వెంకటేశులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, వడ్డెర సంఘం నాయకులు వెంకటేశులకు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం నిర్వహించిన చర్చా వేదికలో వడ్డెరల



సామాజిక, ఆర్థిక, విద్యా మరియు ఉపాధి సమస్యలపై కుంచపు వడ్డే వెంకటేశులు సుదీర్ఘంగా చర్చించారు. వడ్డెర సమాజ అభివృద్ధి కోసం



సంఘటితంగా ముందుకు రావాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హ కుటుంబానికి చేరేలా కృషి చేస్తామని తెలిపారు. రానున్న రోజుల్లో వడ్డెరలకు అన్ని విధాలుగా అండగా నిలిచి, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం రాష్ట్ర నాయకులు మల్లేల జయరామ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బ్యాళ్ల నాగేంద్ర, వడ్డెర రాష్ట్ర నాయకులు గోపాల్, చెయ్యేడు రామకృష్ణ, తెలుగు యువత మాజీ రాష్ట్ర కార్యదర్శి మసులు చంద్రమోహన్, సీపీఐ అనంతపురం రూరల్ మండల కార్యదర్శి గోగుల నరేష్, భాషా, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పరశురామ్, వడ్డెర వెంకటాపురం వెంకట్, యువ నాయకులు నాగార్జున,వడ్డే ఆదినారాయణ, వడ్డే బ్రహ్మయ్య, నరేష్ పాల్గొన్నారు.

# ది నానో'పై వరుస కథనాల ప్రభావం..!

ఎట్టకేలకు స్పందించిన ఇంటర్మీడియట్ శాఖ..!

'ది నానో' జూనియర్ కాలేజీకి


నోటీసులు జారీ చేసినట్లు సమాచారం

అనుమతులు, గుర్తింపు, ఫైర్ సేఫ్టీ వివరాలు

సమర్పించాలని ఆదేశించినట్లు ప్రచారం

ఇక సమగ్ర విచారణ

జరిపి చర్యలు తీసుకుంటారా..?




రంగారెడ్డి / బడంగ్‌పేట్, **(దిక్సూచి ప్రతినిధి):** బడంగ్‌పేట్ మున్సిపల్ పరిధిలోని 'ది నానో' జూనియర్ కాలేజీ నిర్వహణపై వరుసగా వెలువడుతున్న కథనాలు, స్థానికుల ఫిర్యాదుల నేపథ్యంలో ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఎట్టకేలకు స్పందించినట్లు సమాచారం. మంగళవారం జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కళాశాల యాజమాన్యానికి నోటీసులు జారీ చేసినట్లు విశ్వసనీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కాలేజీ నిర్వహణలో అనుమతులు, గుర్తింపు, భద్రతా ప్రమాణాలపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది.

### కదిలిన విద్యాశాఖ..!


దిక్సూచి

ది నానో' నయా దందా.. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం!

ఇంటర్ బోర్డు గుర్తింపు లేదు..
ఫైర్ సేఫ్టీ అసలే లేదు!
అనుమతులు లేకున్నా
లక్షల్లో ఫీజుల దోపిడీ..
జిల్లా ఇంటర్మీడియట్ అధికారి
మౌనం వెనుక 'రహస్యం' ఏంటి..?
రంగారెడ్డి జిల్లా కలెక్టర్ గారూ..
ఇటు చూడండి!

కోళ్లు పెట్టే గూళ్లలాంటి ఇరుకు గదులు..
300 మంది విద్యార్థులు!

ఫైర్ సేఫ్టీ సున్నా.. ప్రమాదం జరిగితే బాధ్యులెవరు?

అధికారుల మౌనం.. ఫిర్యాదులు బుట్టదాఖలు!

కలెక్టర్ గారూ.. విచారణ జరిపించండి!


కొద్ది రోజులుగా కాలేజీ నిర్వహణపై వరుస కథనాలు వెలువడుతుండగా, మున్సిపల్ అనుమతులు, ఇంటర్మీడియట్ బోర్డు గుర్తింపు, ఫైర్ సేఫ్టీ క్లియరెన్స్, విద్యార్థుల భద్రత వంటి అంశాలపై పలు సందేహాలు వ్యక్తమయ్యాయి. ఈ వ్యవహారంపై అధికారులు స్పందించకపోవడంపై తల్లిదండ్రులు, స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. చివరకు జిల్లా ఇంటర్మీడియట్ శాఖ స్పందించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

### వివరణ కోరినట్లు సమాచారం

కాలేజీ నిర్వహణకు సంబంధించిన అనుమతులు, గుర్తింపు పత్రాలు, విద్యార్థుల ప్రవేశాలు, భవన భద్రత, ఫైర్ సేఫ్టీ అనుమతులకు సంబంధించిన పూర్తి వివరాలు సమర్పించాలని నోటీసుల్లో కోరినట్లు సమాచారం. నోటీసులకు కాలేజీ యాజమాన్యం ఎలాంటి వివరణ ఇస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.



### సమగ్ర తనిఖీలు ఉంటాయా..?


ది నానో' నయా దందా.. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం!


ది నానో' పేరుతో విద్యా మాఫియా..?

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం

అధికారుల అండదండలున్నాయా..?

వెంటనే విచారణ జరపాలి

నోటీసులు జారీ చేయడమే కాకుండా క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. మున్సిపల్ శాఖ, ఫైర్ సర్వీసెస్, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు సంయుక్తంగా కాలేజీని తనిఖీ చేసి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.

### నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలే..!

ఒకవేళ కాలేజీ నిర్వహణలో నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లు తేలితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నారు. అన్ని అనుమతులు సక్రమంగా ఉంటే ఆ విషయాన్ని కూడా ప్రజలకు అధికారికంగా వెల్లడించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### అధికారుల తదుపరి చర్యలపై ఆసక్తి

నోటీసులు జారీ చేసినట్లు సమాచారం రావడంతో ఇప్పుడు అందరి దృష్టి జిల్లా ఇంటర్మీడియట్ శాఖ తదుపరి చర్యలపై పడింది. పూర్తి స్థాయి విచారణ అనంతరం వాస్తవాలు వెలుగులోకి వస్తాయా..? లేక వ్యవహారం నోటీసులకే పరిమితమవుతుందా..? అన్నది వేచి చూడాల్సి ఉంది.

Printed , Published and Owned by POLAGONI ALIVELU, and Printed at Smilys Online, 6-7-48, Vanasthalipuram, Shopping Complex, Rangareddy-500070. Telangana State and Published from 17-10-25, Plot No.H.No. 4-136/12, Turkayamjal Journalist Colony, Rangareddy501510, Telangana State. Editor: POLAGONI ALIVELU. PRGI No. TGTEL/25/A3190. Phone No: +91 7989151815